క్లుప్తంగా

కలియుగ వెంకన్నకు విశేష పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. భక్తుల కోసం ప్రత్యేక దర్శనాలు ఏర్పాటు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జగద్గురు పీఠం, డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సెవెన్‌హిల్స్ హాస్పిటల్ సౌజన్యంతో హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎం.ఎస్.రాజు, డాక్టర్ సిహెచ్.వరప్రసాద్ పర్యవేక్షణలో గుండె వ్యాధుల పరీక్షలు ఈసీజీ, బీపీ, సుగర్, పలు రక్త పరీక్షలు జరపనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేసి, పూర్తి వైద్య సహాయం అందచేస్తామన్నారు. స్థానికులు వైద్య శిబిరంలో పాల్గొనాలని సత్యదేవ్ కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభం



కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న మాధవ్, విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని శనివారం బీజేపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్ ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించి కరపత్రం ఆవిష్కరించారు. బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బల్లల పండగ



బల్లల పండగలో పాల్గొన్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన గల రజకుల కుల దైవమైన మహాశివుడు, వీరభద్రుడిని కొలుస్తూ శనివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. రజక సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు కోడూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన పండగలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మహాశివుడు, వీరభద్రులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొక్కాకుల వెంకటరావు, మాజీ కార్పొరేటర్ బాస్కర్ రాజు, రజక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి మతసామరస్య వారోత్సవాలు

మద్దిలపాలెం: ప్రపంచ మతసామరస్య వారోత్సవాలను ఆదివారం నుంచి నిర్వహించనున్నట్టు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీస్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్, గాంధీ సెంటర్ ప్రతినిధి నరవ ప్రకాశరావు ఒక ప్రకటనలో తెలిపారు.

సందడిగా బుల్లయ్య కళాశాల వార్షికోత్సవం



ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కాలేజీ వార్షికోత్సవం శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల బాస్కెట్‌బాల్ కోర్టులో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ముఖ్య అతిథిగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉన్నతాశయాలే లక్ష్యంగా శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్య, క్రీడా సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు డ్యాన్సులు వేసి హుషారెత్తించాయి. కార్యక్రమంలో జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కుమార్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.సి.హెచ్.శ్రీకాంత్, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల తోపులాట..

వేడుకలు ముగిశాక ఒక్కసారిగా విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వెళ్లే సమయంలో తోపులాట జరిగింది. ఈ క్రమంలో విద్యార్థినులు మధ్యలో చిక్కుకొని ఉండటంతో వారికి రక్షణగా వెళ్లిన సంస్కృతం లెక్చరర్ వి.ఎస్.ఎన్.వి..నర్సింగరావు ఇరుక్కుపోయారు. దీంతో తనపై దాడి జరిగినట్టు ప్రచారం జరిగిందే తప్ప.. వాస్తవంగా ఎటువంటి దాడి జరగలేదని నర్సింగరావు కొట్టిపారేశారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సంక్షేమ పథకాల లబ్ధిని వృద్ధురాలికి వివరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 55వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగించారు. ధర్మానగర్ హైవే అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.వి.ఎన్.శశికళ, ఎస్.అప్పారావు, దుప్పలపూడి శ్రీనివాసరావు, రత్నాకర్, డైరెక్టర్లు ఆర్.శ్రీను, నూకరాజు, వార్డు నాయకులు జూంజూరు గోవింద్, వై.శ్రీను, గంగా మహేష్, శ్రీను, సురేష్, కరుణ, లక్ష్మి, నాగలక్ష్మి, శివప్రసాద్, దాసు, సీనియర్ నాయకులు హరిపట్నాయక్, బి.గోవింద, బాబ్జి, రాఘవులు, ఖాదర్, ఈశ్వరరావు, సంతోష్, శ్రావణ్, సుజాత, ఎస్.శ్రీను, ధనరాజు, అశోక్ సచివాలయ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న సుప్రభాత సేవా భక్తులు, అర్చకులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటలకు ఆలయ ముఖ్య మండపంలో వేదమంత్రోచ్ఛారణలు, మేళతాళాల మధ్య వేద పండితుల సమక్షంలో ఆర్జిత సుప్రభాత సేవా భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామికి సుప్రభాతం చదివి వినిపించి ప్రత్యేక పూజలు జరిపారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం నక్షత్ర, కర్పూర, కూష్మాండ , కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడు మురళిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ వెంకటేష్

సీతమ్మధార: తప్పిపోయిన ఓ బాలుడిని తల్లిదండ్రులకు ఫోర్త్‌టౌన్ పోలీసులు అప్పగించారు. వివరాలిలా.. బర్మా క్యాంప్ ప్రాంతానికి చెందిన నక్క రాజు, భవానీ దంపతుల కుమారుడు నక్క మురళి(10) శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి దారి తెలియక పోర్టు హాస్పిటల్ దగ్గర తిరుగుతున్నాడు. అటువైపు వెళ్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ బాలుడిని గుర్తించి ఫోర్త్‌టౌన్ బ్లూకోట్స్ వెంకటేష్‌కు అప్పగించారు. వార్డు మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాలుడి తల్లిదండ్రుల వివరాలు సేకరించి సీఐ శ్రీనివాసరావు సమాచారం అందించారు. వారు పోలీస్ స్టేషన్‌కు రావడంతో మురళిని అప్పగించారు. తప్పినపోయిన బాలుడిని గంట వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించడంతో పోలీసులకు అభినందనలు తెలిపారు.

గంజాయి కేసులో ఏయూ సెక్యూరిటీ గార్డుల అరెస్ట్

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఏయూలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న చంద్రమౌళి, అప్పలరాజు, సురేష్ వద్ద అక్రమంగా 500 గ్రాములు గంజాయిని గుర్తించారు. ఈ ముగ్గుర్ని అరెస్ట్ చేసి శనివారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

డాక్‌యార్డ్‌లో ఉద్యోగి మృతి

మల్కాపురం: డాక్‌యార్డులో విధులకు వెళ్లిన ఓ ఉద్యోగి విద్యుత్ షాక్ కారణంగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా... 58వ వార్డు రామ్‌నగర్ ప్రాంతంలో ఒడరేవుల కుమార్‌స్వామి (35) భార్య, ఇద్దరు పిల్లలతో నివసిస్తున్నారు. నేవల్ డాక్‌యార్డ్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఫస్ట్ షిఫ్ట్‌కు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం 8.15 గంటల సమయంలో డాక్‌యార్డ్‌లోని డాక్ వద్ద గల ఓ నౌక దిగువవ కుమార్‌స్వామి నీటిలో మునిగి ఉన్నట్టు ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సహచర ఉద్యోగులు గుర్తించారు. వెంటనే వారు ఉన్నతాధికారులకు సమాచారమివ్వడంతో కుమార్‌స్వామిని ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్టుగా వైద్యులు నిర్ధారించారు. వెంటనే అధికారులు మల్కాపురం పోలీసులకు, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఐఎన్ఎస్ కల్యాణి ఆస్పత్రికి వెళ్లి ఘటనపై ఆరా తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బల్లిగిరికి భక్తుల తాకిడి



అల్లిపురం: బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు సుప్రభాతసేవ, ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల గోత్ర నామాలతో సహస్రనామాభిషేకం చేపట్టారు.

ఆకట్టుకున్న భక్తి సంగీతం

సాయంత్రం ఆలయ మండపంలో కంచరపాలెం శ్రీ రాజరాజేశ్వరి భజన మండలి సభ్యులు పాడిన భక్తి గీతాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వారికి ఆలయ అర్చకులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కూలే స్థితిలో ట్రెజరీ కార్యాలయం ప్రహరీ



బీటలు వారి ధ్వంసమైన ప్రహరీ

సీతమ్మధార: సీతమ్మధారలోని ట్రెజరీ కార్యాలయం ప్రహరీ కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. ఇప్పటికే కార్యాలయ గోడలు బీటలు వారాయి. ఇక్కడికి ప్రతి నెలా పెన్షనర్లు వస్తుంటారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి గోడకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధారణపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాహన చోదకులు

మర్రిపాలెం: హెల్మెట్ ధరించి వాహనం నడపడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద శనివారం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు నేతృత్వంలో ఎస్ఐ పాపారావు హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన 20 మందికి కౌన్సెలింగ్ చేసి జరిమానా విధించారు. 'వినాయకుడి చిత్రంతో కూడిన తలపోతే మళ్లీ రాదు' అనే అవగాహన ప్లకార్డు ప్రదర్శించారు. మరో ప్లకార్డులో హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి అంటూ వాహన చోదకులకు అవగాహన కల్పించారు. 69 మంది వద్ద పాత చలానాలు సుమారు రూ.11,370 వసూలు చేశామని ఎస్ఐ పాపారావు తెలిపారు.

బోరుకు మరమ్మతులు



రామాలయం రోడ్డులో బోరు బాగు చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు రైల్వే న్యూకాలనీలోని రామాలయం రోడ్డులో పనిచేయని బోరుకు శనివారం జీవీఎంసీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఈ మార్గంలో రామాయణం రెసిడెన్సీ ముందున్న బోరు రెండేళ్లుగా పనిచేయడం లేదు. ఎన్ని సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా.. మరమ్మతులు జరగలేదు. రానున్న వేసవి దృష్ట్యా బోరును బాగుచేయించాలని కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీని స్థానికులు కోరారు. దీంతో సమస్యను అధికారుల దృష్టికి ఆమె తీసుకెళ్లడంతో చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియా వార్డు కన్వీనర్ల నియామకం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం జరిగింది. ఉత్తర నియోజకవర్గంలోని 17 వార్డులకు వార్డుకొక కన్వీనర్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన నియామకాల వివరాలను శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఎస్.వి.ఆర్.నవీన్‌రాజ్, మిరిటిపాటి సతీష్‌కుమార్, శ్రావణ్‌కుమార్, గనివాడ తరుణ్‌తేజ, పాట్నూరు చందన్ సాయి, పిల్లా శ్యామ్‌కుమార్, పిడుగు వెంకటరమణ, జి.అశోక్‌వర్మ, తాండ్రంగి మహేష్‌బాబు, వి.భరత్‌కుమార్, కొటాన శ్రీనివాసరావు, ఎర్రరాజు, సిహెచ్.శివాజీ, రెయ్యి గణేష్, పేడాడ జ్యోత్స్న, పి.శివప్రసాద్, బోర విష్ణువర్ధన్‌లు సోషల్ మీడియా వార్డు కన్వీనర్లుగా నియమితులయ్యారు.

రక్తదానంపై అవగాహన

దాబాగార్డెన్స్: రక్తదానంపై శనివారం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. లయన్స్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జిలు దుర్గాప్రసాద్, అంజిత, స్వామి వివేకానంద సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్, ప్రముఖ సంఘ సేవకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానంపై చాలా మందికి అపోహలున్నాయని, అది ఎంత మాత్రం నిజం కాదన్నారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి రక్తదానం చేయడం వల్ల మనిషి చాలా ఆరోగ్యంగా ఉంటాడని, హెచ్‌బీ 12.5 ఉంటే ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానం చేసిన తర్వాత ఆ రక్తాన్ని అనేక పరీక్షలు చేసి పేషెంట్‌కు అందిస్తారన్నారు. ఆ టెస్టుల్లో ఏమైనా వ్యాధులుంటే బయటపడతాయని, ఆ పేషెంట్‌ని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. మెడికల్ ఆఫీసర్ అంజిత మాట్లాడుతూ ఏడాదిలో దేశం మొత్తానికి 14.6 మిలియన్ యూనిట్ల రక్తం కావలని.. అయితే 11.5 మిలియన్ యూనిట్ల రక్తం మాత్రమే లభిస్తుందన్నారు. అనంతరం ఇటీవల నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పబ్లిక్ డిమాండ్

చెత్తతో నిండిన డస్ట్ బిన్లు



రేసపువానిపాలెం రోడ్డులో డస్ట్ బిన్ వద్ద పేరుకుపోయిన చెత్త

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం ప్రధాన రహదారుల్లో ఎక్కడికక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల డస్ట్ బిన్లు చెత్తతో నిండిపోయాయి. పరిసరాలు దుర్గంధభరితంగా మారడంతో రాకపోకల సమయంలో ఇబ్బంది పడుతున్నాం. పారిశుధ్య అధికారులు దృష్టి సారించి సకాలంలో వ్యర్థాలు తొలగించేలా చర్యలు చేపట్టాలి.

– మణికంఠ, రేసపువానిపాలెం

గెడ్డలు శుభ్రం చేయండి



రేసపువానిపాలెం గెడ్డలో భారీగా వ్యర్థాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని గెడ్డల్లో పెద్ద ఎత్తున పూడికలు పేరుకుపోయాయి. నెలల తరబడి తొలగించక పోవడంతో దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. హైవే పక్కనే ఉన్న రేసపువానిపాలెం గెడ్డ, సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌కు ఆనుకుని ఉన్న గెడ్డలో ప్లాస్టిక్ బాటిళ్లు, చుట్టుపక్కలున్న చికెన్ షాపుల్లోని వ్యర్థాలు, మురుగు నీరు నిలిచిపోయాయి. జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి గెడ్డల శుభ్రతకు చర్యలు చేపట్టాలి.

– లక్ష్మణరావు, రేసపువానిపాలెం

బీసీల అభ్యున్నతికి కృషి



అసోసియేషన్ కొత్త అధ్యక్షుడు రవికుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న వెంకటేశ్వరరావు

సీతంపేట: బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా పెబ్బిలి రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో సంఘ జాతీయ అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిహార్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని అన్ని రాష్ట్రాల్లో కులాల వారీగా జనాభా లెక్కలు తయారు చేయాలని సూచించారు. త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా కులాల వారీగా జనగణన జరిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. పెబ్బిలి రవికుమార్ మాట్లాడుతూ బీసీలందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలను నియమించి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకర్ల రాజారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిహెచ్.నాగేశ్వరరావు, ఊర్వశి మహాలక్ష్మి, చిత్రాడ అప్పారావు, శంకరరావు, వెంకటలక్ష్మి, కృష్ణవేణి, వెంకటరమణ, ఈశ్వరరావు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం





పాడైన స్తంభం కింది భాగం

చెక్కుదురాయి బిల్డింగ్ సమీపంలో ఒరిగిపోయిన విద్యుత్ స్తంభం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు చెక్కుదురాయి బిల్డింగ్ సమీపంలో విద్యుత్ విభాగం సిబ్బంది మరమ్మతుల కోసం స్తంభం ఎక్కగా.. ఉన్నట్టుండి అది ఒరిగిపోయింది. దీంతో అప్రమత్తమైన సిబ్బంది కిందకు దూకి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. విద్యుత్ స్తంభం కింది భాగం తుప్పుపట్టి శిథిలం కావడంతో దాని పైకి ఎక్కగానే బరువుకు కూలిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

తెలుగుభాష సదస్సు వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం తెలుగు శాఖ, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21, 22 తేదీల్లో అంతర్జాతీయ తెలుగు భాషా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్ www.telugu.inను ఏయూ ఉప కులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సమావేశాల రూపకర్త డాక్టర్ మూర్తి రేమళ్ల ఇస్రో శాస్త్రవేత్త మార్గదర్శనంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులతో తయారు చేసిన ఈ వెబ్‌సైట్‌లో సమావేశాలకు సంబంధించిన అన్ని వివరాలను ఒకే చోట నిక్షిప్తం చేస్తున్నారు. ప్రత్యక్షంగా పాల్గొన లేని వారికి ప్రత్యక్ష ప్రసారం లింక్ కూడా దీనిలో ఉంచడం జరుగుతోంది. రెండు రోజులు జరిగే సమావేశాల్లో 12 సదస్సులు 70 మంది వక్తలు, ఆచార్యులు పరిశోధకులు వివిధ దేశాల మాతృభాషా ప్రేమికులు, సాహితీవేత్తలు పాల్గొంటారు. టీఎల్ఎన్ సభామందిరం వేదికగా ఈ సమావేశాలు జరుగుతాయి. శ్రీ మల్లిక్ పుచ్చా (అమెరికా) ఆధ్వర్యంలో ప్రత్యేక సమాంతర సభా మందిరంలో భాగవత ఆణిముత్యాల కార్యక్రమం నిర్వహిస్తారు. సమైక్య భారతి జాతీయ గౌరవాధ్యక్షుడు రేమళ్ళ మూర్తి, సమైక్య భారతి సమన్వయకర్త కన్నయ్య, ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖ ఆచార్యులు అయ్యగారి సీతారత్నం పాల్గొన్నారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై రక్షణ చర్యలు

- ప్రమాదాల నియంత్రణకు ఫ్లెక్సీలు, రేడియం స్టిక్కర్ల ఏర్పాటు



తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై ప్రమాద స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

అల్లిపురం: తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై తరచు జరుగుతున్న ప్రమాదాల నివారణకు నగర పోలీసులు చర్యలు చేపట్టారు. ఫ్లైఓవర్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 10 నుంచి 12 మంది వరకు దుర్మరణం చెందారు. ట్రాఫిక్ ఏడీసీపీ అరీఫుల్లా, జోన్-1, ఏసీపీ కుమారస్వామి, జోన్-2 ఏసీపీ శరత్ కుమార్, ఈస్ట్ వన్ సీఐ సూరినాయుడు, ఈస్ట్-2 సీఐ షణ్ముఖరావు, జీవీఎంసీ, ఆర్ అండ్ బీ అధికారులు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కారణాలు విశ్లేషించారు. అనంతరం ప్రమాద ప్రాంతం వద్ద గ్లోసైన్ బోర్డులు, ప్రమాదంలో మృతి చెందిన వారి ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఒక కానిస్టేబుల్‌ను బీట్ డ్యూటీకి ఏర్పాటు చేసి వాహన చోదకులను అప్రమత్తం చేయనున్నట్లు పోలీసులు, అధికారులు తెలిపారు.